క్లుప్తంగా

కాల భైరవాష్టమి పూజలు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని ఎం ఎస్ కొట్టాల గ్రామంలో అమావాస్యను పురస్కరించుకుని గురువారం శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 8 గంటలనుంచి కాలాష్టమి పూజలను నిర్వహించారు. అర్చకులు శ్రీధర్‌శర్మ తొలుత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. ఆలయ ప్రత్యేక పూజల్లో భాగంగా భక్తులు కుష్మాండ దీపాలతో స్వామికి హారతులు పట్టారు.

14 నుంచి మాచుపల్లె దర్గా ఉరుసు

కడప కల్చరల్ : ఈనెల 14వ తేదీ నుంచి మాచుపల్లె దర్గా ఉరుసు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ ప్రతినిధులు, ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. హజరత్ సయ్యద్‌షావలి సాహెబ్‌గా పేరున్న ఈ ఉరుసు ఉత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి 9 గంటలకు ఫకీర్ల మేళతాళాలతో గంధం, పూలచాందిని గ్రామంలో ఊరేగింపు, సమర్పణ ఉంటుందన్నారు. సోమవారం రాత్రి ఉరుసు ఉత్సవం జరుగుతుందని, మంగళవారం తహలీల్ ఫాతెహా ఉంటాయన్నారు. ఉరుసు రోజున యుపీకి చెందిన అబ్బాస్ సాబ్రిరి, మైసూరుకు చెందిన తైహసీనాల మధ్య ఖవ్వాలీ కచేరి ఉంటుందని వివరించారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కనీస వేతనాలు వర్తింపచెయ్యాలని ఏపీ ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ రాజేష్ అన్నారు. గురువారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కేసీ.బాదుల్లా, ప్రసాదు, సుభద్రమ్మ, శాంతమ్మ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కడప సెవెన్‌రోడ్స్ : దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఓం రసూల్‌ను శనివారం సన్మానిస్తున్నామని దూదేకుల భవన కమిటీ, బీసీ సంక్షేమ నాయకులు ఓబులేశు, అజంతుల్లా, లింగమూర్తి, శ్రీను,గోవిందునాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ ఉదయం 10.15 గంటలకు కడప ఐఎంఏ హాలులో ఈ సన్మాన సభ ఉంటుందన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని దూదేకుల కులస్తులు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

21న అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 21వ తేదీన ఆదాయ పన్ను లెక్కింపుపై ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు సివి ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సు కడపలోని ఎన్‌జీవో భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రతిశాఖ ఉద్యోగి పాల్గొని తమ అనుమానాలు నివృత్తి చేసుకుని ఆదాయం పన్ను లెక్కింపు తెలుసుకోవాలని కోరారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలు సంక్రాంతి సెలవులను ప్రైవేటు ఉపాధ్యాయులకు ఇవ్వకుండా, అడ్మిషన్ల పేరుతో వారిపై ఒత్తిడి తెస్తున్నారని, ఇది తగదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ పేర్కొన్నారు. గురువారం ఈ మేరకు డీఈఓ రాఘవ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఓబులేసు, రవి కుమార్, కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

కడప కార్పొరేషన్ : భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో నడిచి, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు జరుగు రాజశేఖర్ రెడ్డి, 1వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. చెన్నయ్య అన్నారు. ఈనెల 19వ తేదీ విజయవాడలో అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సందర్భంగా గురువారం పాతకడప సమావేశ మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక ప్రజలతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఆర్ఐ విశ్వనాథరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మునిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బీబీ సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్వాడీల నిరసనలు

కమలాపురం : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం 31వ రోజు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

సంప్రదాయాలకు నెలవు సంక్రాంతి పండుగ



కడప ఎడ్యుకేషన్ : కళాశాల ఆవరణంలో బోగి మంటలను వేస్తున్న విద్యార్థులు



కడప అగ్రికల్చర్: బహుమతి అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- డిప్యూటీ సీఎం అంజాద్‌బాష
- మార్కెట్‌యార్డులో ముగ్గుల పోటీలు

కడప అగ్రికల్చర్ : తెలుగు ప్రజలకు వారి సాంప్రదాయాలకు నెలవు సంక్రాంతి పండుగ అని, ఈ సంక్రాంతి పండుగ ప్రజలకు పాడి పంటలు, సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలను తెచ్చి పెట్టాలని డిప్యూటీ సీఎం అంజాద్‌బాష ఆకాంక్షించారు. గురువారం కడప మార్కెట్‌యార్డులో మార్కెట్ యార్డు డైరెక్టర్ పల్లెంకొండు సంపత్, చైతల్య ఆధ్వర్యంలో యార్డు చైర్‌పర్సన్ బంగారు గంగాదేవి, మార్కెట్ యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య సహకారంతో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ముందుగా బోగి మంటలను వేసి వేడుకలను నిర్వహించారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాష హాజరై ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంప్రదాయం ఉట్టి పడేలా సంక్రాంతి సంబరాలు ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలందరికి ముందుస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, నాయకులు తోట కృష్ణ, రామ్మోహన్, కార్పొరేటర్లు షఫీ, జుహీర్, గంగరాజు పాల్గొన్నారు.

యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో..

కడప ఎడ్యుకేషన్ : కడప బాలాజీనగర్‌లోని యస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బోగి మంటలను వేశారు. అనంతరం ఫోక్, ట్రెడిషనల్ డ్యాన్స్‌లను నిర్వహించారు. అలాగే మా వంట, రంగోలి, బొమ్మల కొలువు, గోలీలు, కర్ర బిల్లా, బొంగరాలు, గాలిపటాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



కడప కల్చరల్ : విజేతకు బహుమతి అందజేస్తున్న అతిథులు

చేస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాష

కడప కల్చరల్ : స్థానిక ఆర్తీ ఉమెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని గురువారం చిరుధాన్యాలతో చేసిన వంటల పోటీ నిర్వహించారు. సంస్థ చైర్మన్ పీవీ సంధ్య, కార్యదర్శి దుర్గాకుమారిల పర్యవేక్షణలో రాజు భద్రావతి, శైలజ, కె.స్నేహలత, భాగ్యమ్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలు లావణ్య, ప్రసన్న, యాస్మిన్‌లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 5 వేలు, రూ. 4 వేలు, రూ. 3 వేలను అందజేశారు. మరో ఐదుగురికి ప్రత్యేక బహుమతులుగా ఒక్కొక్కరికి రూ. 1000 నగదు అందజేశారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో...

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సంక్రాంతి సంబరాలను వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఎంతో వేడుకగా నిర్వహించుకునే పెద్దపండుగ సంక్రాంతి అన్నారు. సంక్రాంతి అంటేనే రైతుల పండుగ అని, రైతులు పండించే నవధాన్యాలు ఇంటికి చేరుతాయన్నారు. గ్రామీణ సంప్రదాయాలను, ఆనాటి ఆచార, వ్యవహారాలను గుర్తుచేసేలే వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణల్లో రంగవల్లులు వేసి సందడి చేయగా, భోగిమంటలు వేసి విద్యార్థులు వేడుకలు చేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు వీసీ, రిజిస్ట్రార్‌లు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏఎఫ్‌యూ : భోగిమంటలను వేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

డ్రైవింగ్ లైసెన్స్ కోసం క్యూ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం రవాణాశాఖ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. జిల్లాలో వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తూ ఫైన్‌లు విధిస్తుండడంతో డ్రైవింగ్ లైసెన్స్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి పరిగెడుతున్నారు. రోజుకు డ్రైవింగ్ లైసెన్సులు కోసం దాదాపు 200 మంది వాహనదారులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకొని ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షకు వస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా రవాణా శాఖ అధికారులు తగిన సదుపాయాలను కల్పించారు.



ఎల్ఎల్ఆర్ పరీక్ష కోసం వచ్చిన వాహనదారులు

క్యాలెండర్ ఆవిష్కరణ



కాల్యెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ తాహీర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఈఓ రాఘవరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు డిప్యూటీ డైరెక్టర్ ఖదీరున్నీసా, కడప ఎంఈఓ పాలెం నారాయణ, ఆలిండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ జిల్లా అధ్యక్షులు రమణ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా పశుసంవర్థశాఖ అధికారి శారదమ్మ

కడప అగ్రికల్చర్ : ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ వైఎస్సార్ జిల్లాల డైరీ, క్యాలెండర్-2024ను గురువారం ఆ సంఘ జిల్లా చైర్మెన్ నంద్యాల రాజశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా పశుసంవర్థశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఏపీ నాన్ గ్రాడ్యుయేట్స్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చాంద్‌బాష, అన్నమయ్య జిల్లా చైర్మన్ జయప్రకాష్, నాయకులు సదాశివయ్య, వెంకటసుబ్బయ్య, వరదయ్య, బాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిరంతర ప్రేరణ జ్యోతి సీతారామయ్య

కడప కల్చరల్ : పర్యాటక పితామహులు సిద్దవటం సీతారామయ్య నిరంతర ప్రేరణ జ్యోతిగా వెలిగారని వక్తలు పేర్కొన్నారు. ఆయన సంతాపసభను గురువారం స్థానిక గ్రాండ్ ఇన్ సమావేశ మందిరంలో ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు.
లయన్ చిన్నపరెడ్డి అధ్యక్షతన తొలుత సీతారామయ్య చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీమ పర్యాటక అభివృద్ధి వెనుక ఆయన కృషి ఉందన్నారు. ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఎలియాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి , వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ రామాంజులరెడ్డి, ఆధ్యాత్మిక వేత్త దేసు వెంకటరెడ్డి మాట్లాడుతూ సీతారామయ్య సేవలను కొనియాడారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, కేవీ రమణారెడ్డి కవితాగానంతో సీతారామయ్య వ్యక్తిత్వాన్ని కొనియాడారు.



సిద్దవటం సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

రసవత్తరంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

కమలాపురం : రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.12కోట్ల ప్రైజ్ మనీ ఏర్పాటు చేసి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక సీఎస్ఐ చర్చీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఆడుదాం.. ఆంధ్రా మండల స్థాయి క్రికెట్, వాలీబాల్ క్రీడలను బ్యాటింగ్ చేస్తూ ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రైజ్ మనీకి అదనంగా మన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి సొంత నిధులతో ప్రైజ్‌మనీని పెంచడం సంతోషకరమన్నారు. గురుకుల పాఠశాలలో కబడ్డీ, ఖో-ఖో తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, కమీషనర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు .. ఆడుదాం ఆంధ్ర క్రీడలు

చెన్నూరు : రెండవ రోజు మండల స్థాయిలో ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలు మండల అధికారుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళలకు ఖోఖో, వాలీబాల్ కబడ్డీ, మహిళల క్రికెట్ పోటీలను నిర్వహించారు. అదేవిధంగా ఉప్పరపల్లె గ్రౌండ్ లో పురుషులకు క్రికెట్ పోటీలు, చెన్నూరు పార్కులో వాలీబాల్‌తో పాటు బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు.



కమలాపురం : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే లక్ష్యం

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమమే భారత చైతన్య యువజన పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి పండిట్ డేవిడ్ తెలిపారు. గురువారం కడపలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ సారథి బవనాశి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూహక్కుల చట్టం రద్దయ్యేవరకు పోరాటం

కడప అర్బన్ : ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కుల చట్టం రద్దయ్యేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని భారత న్యాయవాదుల సంఘం ప్రభుత్వాన్ని హెచ్చరించింది. గురువారం భారత న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కడప న్యాయవాదులు కడపలోని జిల్లా కోర్టు గేటు వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బొగ్గుల గుర్రప్ప, భారత న్యాయవాదుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు నాగ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సి. సుబ్రమణ్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ టి. ఈశ్వర్, కడప టౌన్ అధ్యక్షుడు రామకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్ : మెగా డీఎస్సీ విడుదల చేయకపోతే విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని యువజన సంఘ నాయకులు అన్నారు. గురువారం కడప కొత్తబస్టాండ్ వద్ద ప్రగతి నర్సింగ్ హోమ్‌లో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సగలి రాజేంద్రకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సునిల్‌కుమార్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మనోజ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహిళలకు పోటీలు

చెన్నూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈనెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో చెన్నూరులోని వెలుగు కార్యాలయం ఆవరణలో మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న మహిళలందరూ నిర్ణీత సమయానికి పోటీల్లో పాల్గొనాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వల్లూరు : మండల పరిధిలోని రెండు గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పర్యటించనున్నారని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదట మండలంలోని తప్పెట్ల గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం దుగ్గాయపల్లె గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. సంబంధిత అధికారులు పాల్గొనాలని కోరారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

వల్లూరు : మండలంలోని కోట్లూరు గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీఓ జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్య నిపుణులు హాజరై వైద్య సేవలను అందిస్తారని తెలిపారు.

ఘనంగా జాతీయ యువజనోత్సవం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్, పరుగు పందేలను నిర్వహించారు. సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జానపద నృత్యం, జానపద గేయం, వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎస్ఏ ఎస్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను గురువారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజా మాట్లాడుతూ జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని రాష్ట్ర యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. యువత ముందుకొచ్చి రక్తదానాలు చేసి సామాజిక సేవ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.



స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న స్టెప్ సీఈఓ

రైతాంగ వ్యతిరేక చర్యలు ఆపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీజేపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని చెప్పిన మోడీ అధికారంలోకి వచ్చి రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారన్నారు. ప్రతి ఏటా పంటల సాగుకు ఖర్చులు పెరిగాయన్నారు. పెట్టుబడికి తగ్గట్టు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మూలె వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వరయ్య

వైవీయూ విద్యార్థుల ప్రతిభ

వైవీయూ : దక్షణ భారతదేశ స్థాయి యువజనోత్సవాలలో రాణించిన విద్యార్థులను వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు. వైజాగ్‌లోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన దక్షణ భారతదేశ యువజనోత్సవాలలో వైవీయూ లలితకళల విద్యార్థులు ప్రతిభ చాటారు. రంగోలిలో రమాజ్యోతి ప్రథమస్థానం, పెయింటింగ్‌లో అరవింద్ ఐదో స్థానం, కార్టూన్‌లో తృతీయ స్థానం, పోస్టర్ మేకింగ్‌లో దేవదాసుకు తృతీయ స్థానం, ఇన్‌స్టలేషన్ విభాగంలో ఆయుష్ బృందం ముత్యం, సింహాద్రి, బలరాముడులకు 5వ స్థానం, ఫొటోగ్రఫీలో షేక్ హుసేన్‌కు నాలుగో స్థానం, మెహందీ ఆర్ట్స్‌లో కె.శ్రీలతకు తృతీయ స్థానం లభించింది. విజేతలంతా విశ్వవిద్యాలయానికి చేరుకొని వీసీని కలిశారు. వీసీ వారిని అభినందించారు. కార్యక్రమంలో పీఆర్ సెల్ సంచాలకులు డా. ఎన్వీ సుబ్బారెడ్డి, యూనివర్శిటీ కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ, లలితకళల శాఖ విభాగాధిపతి డా. కె. మత్యుంజయరావు, డా. లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

యోగివేమన విశ్వవిద్యాలయం సమాజ సేవలో భాగసామ్యం అవుతోందని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వైవీయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లెలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వీసీ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వైవీయూ సేవలు పల్లెలకు విస్తరిస్తున్నాయన్నారు. విశ్వవిద్యాలయ కళాశాల ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, ఎముకలు, కీళ్ల వ్యాధి నిపుణులు డా.కె.పార్థసారథి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.ఎన్.వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. విశ్వవిద్యాలయం బయో కెమిస్ట్రీ విద్యార్థులకు ఉచితంగా బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు , వైద్యులు పవన్, రెడ్డిబాష పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

కడప కార్పొరేషన్ : రాష్ట్రంలో త్వరలో రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో క్లస్టర్ పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ఎంతో దూరం లేదని, ప్రతి ఒక్కరూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తమ డివిజన్లలో చురుగ్గా పనిచేయాలన్నారు. బూత్‌లెవెల్ ఏజెంట్ల నియామకం, ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. చనిపోయిన వారు, దొంగ ఓట్లు ఉన్నట్లయితే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, చేనేత ఇతర కులస్తులకు ప్రభుత్వం చేస్తున్న మంచిని తెలపాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఈ పథకాలు కొనసాగుతాయన్నారు. చంద్రబాబు ఇచ్చే గ్యారెంటీలు, ష్యూరిటీలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అహమ్మద్‌బాషా, జమాల్‌వలీ, సుబ్బారెడ్డి, హరూన్ బాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు

పండుగలా మహా శిల్పం ఆవిష్కరణ

కడప కార్పొరేషన్ : విజయవాడలో ఈనెల 19న భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల మహా శిల్పం ఆవిష్కరణ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు కడప నియోజకవర్గం నుంచి అత్యధిక సంఖ్యలో ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మెన్ పులి సునీల్ కుమార్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు. జాషువా. కార్పొరేటర్లు కె. బాబు, చెన్నయ్య, కోఆప్షన్ సభ్యురాలు బండి మరియలు, వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, సీహెచ్ సునీల్, సంపత్, లక్ష్మీనారాయణ, శ్యామ్, సుశీలమ్మ, తులశమ్మ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

డిప్యూటీ సీఎంకు సన్మానం

కడప కార్పొరేషన్ : ఉమ్రా యాత్ర పూర్తి చేసుకుని వచ్చిన ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషాను గురువారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు పి.జయచంద్రారెడ్డి, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, షఫీ, టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, రామలక్షుమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

వల్లూరు : మండలంలో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని మండల స్పెషలాఫీసర్ వి. బ్రహ్మయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులతో గురువారం వివిధ అంశాలపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా మండలంలో జరుగుతున్న గృహ నిర్మాణాల ప్రగతిని గురించి చర్చించారు. జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాల కల్పనలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ వేసేలా చూడాలని ఆదేశించారు. ఎంపీడీఓ జయశ్రీ, డిప్యూటీ తహశీల్దార్ సుహాసిని, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఎంఈవో -2 విజయారెడ్డి, ఏపీఎం శైలజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ బ్రహ్మయ్య